క్లుప్తంగా

నందిన్నె చెక్‌పోస్టుపై పోలీస్ ఫోకస్



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెక్‌పోస్ట్ సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలు క్షుణంగా పరిశీలించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు, బంగారం తీసుకెళ్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, చక్రవర్తి, పరమేష్‌గౌడు, ప్రేమ్‌రెడ్డి, శంకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: మద్యం తీసుకెళ్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సాయంత్రం గద్వాల మండలం మెళ్లచెరువు గ్రామానికి చెందిన ఆరుగురు అయిజ రోడ్డు మార్గంలోని ఓ వైన్ షాపు నుంచి రూ. 60 వేల విలువ గల మద్యం తీసుకెళ్తున్నారు ఈ సమాచారం మేరకు పట్టణ శివారులో తనిఖీ చేయగా మద్యం స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి మాలదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అయ్యప్ప మాలాధారులు మణికంఠ అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ధర్మకర్త దామోదర్ రెడ్డి, తదితర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఉండవెల్లి: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం కర్నూల్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల ప్రకారం.. మండలంలోని కలుగోట్లలో ఈ నెల 20న గోవిందయ్యాచారి(68) అనారోగ్య సమస్యతో బాధపడుతుండే వాడు. ఇంట్లో ఎవరు లేని స మయంలో బాత్రూంలో ఉన్న యాసిడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతనిడిని వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గోవిందయ్యాచారి బుధవారం మృతి చెందాడు. అతని భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు తెలిపినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం

- ప్రతి రైతుకు రైతుబంధు ఇస్తున్న కేసీఆర్‌కు అందరు ఓటేయ్యాలని, మహిళలకు గ్యాస్ రూ. 400కే అందజేస్తారని ఆలోచించి ఓటేయ్యాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం ఉండవెల్లి మండలంలోని ఇటిక్యాలపా డు, తక్కశిల, కంచుపాడు, ఉండవెల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజేయుడును గెలిపించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ప్రచారం చేశారు.
- గట్టు మండలంలోని ఇందువాసి, చమన్‌ఖాన్‌దొడ్డి, బల్గెర, మాచర్ల, యల్లందొడ్డి, బల్గెర గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ప్రచారం నిర్వహించారు. గద్వాల జిల్లా కేంద్రంలో ధరూరు, కేటీదొడ్డి మండలాల బీజేపీ, బీఆర్‌ఎస్ నా యకులు కార్యకర్తలు ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.
- బీఎస్పీని ఆశీర్వదించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అతిఖుర్ రహ్మాన్ కోరారు. గద్వాల మండలం కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు.
- ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల్లో బుధవారం ఆయా పార్టీల శ్రేణులు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు.
- బీఎస్పీని ఆదరిస్తే అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని వల్లూరు, వేముల, బట్లదిన్నె, పుటాన్‌దొడ్డి, కోదండాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి విజేయుడు అన్నాడు. అలంపూర్ పట్టణం, మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపూర్, బుక్కాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- ఎర్రవల్లి మండల కేంద్రంలోని కూడళిలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచాక కమిటీ చైర్మన్ విజయశాంతికి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.
- అలంపూర్ స్థానికున్ని ఒక్కసారి అవకాశం కల్పించాలని అలంపూర్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్ అన్నారు. అలంపూర్ పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో అయిజ పట్టణంలో నిర్వహించిన ప్రజా గర్జన సభకు ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వాహనాల ద్వారా తరలివెళ్లారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- సీడ్ మాఫియా, రియల్ మాఫియాలు ఒక్కటయ్యాయి
- ధరూరు బీఆర్‌ఎస్ మహిళా ఆశీర్వాద సభలో అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బూత్‌కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు/మల్దకల్: ప్రజలకు ఏది అవసరమో.. వారికి ఏమి ఇవ్వాలో కేసీఆర్‌కు తెలుసునని, ఆ గ్యారంటీ.. ఈ గ్యారంటీ అని ప్రజలను మభ్య పెట్టే వారు మన మధ్యకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని.. బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలో జరిగిన మహిళా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. నడిగడ్డ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. అర్ధరాత్రి అన్నదాతలు కరెంటు కోసం పొలాల వద్ద పడిన కష్టాలను ఒక సారి గుర్తుకు తెచ్చుకుంటే బాధేస్తుందన్నారు. రైతుల బాధలు తెలిసిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. రైతుకు పంట పెట్టుబడి ఇచ్చి ఆదుకున్న నాయకుడు ఎవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబ పెద్ద అయిన రైతు చనిపోతే రూ.5లక్షల బీమా ఇచ్చారని, ఆడ పిల్ల పుడితేనే భారం అనుకున్న తరుణంలో రూ. లక్షా 116 అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతును రాజు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జెడ్పీటీసీలు పద్మ, రాజశేఖర్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గడ్డం కృష్ణారెడ్డి మాట్లాడుతూ కులం పేరుతో ఒకరు, మతం పేరుతో ఒకరు మతతత్వ పార్టీలు గ్రామాలకు వచ్చి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారని వారి మాటలు నమ్మొద్దని, కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్ శ్రీధర్, డీఆర్ విజయ్ కుమార్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ రైతుప్రభుత్వం వస్తుంది

గద్వాల రూరల్: మళ్లీ మన రైతు ప్రభుత్వం వస్తుంది, కేసీఆర్ సీఎం అవుతారు, రైతును రాజుచేయాలన్న కలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుబంధు సాయాన్ని రూ.10వేల నుంచి రూ.16వేలకు పెంచుతారంటూ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి రైతులతో ముచ్చటించారు. రైతులు సైతం ఎమ్మెల్యేతో నవ్వులు కలుపుతూ మద్దతు తెలిపిన ఘటన బుధవారం గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డులో కనిపించింది.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



రైతులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అ భివృద్ధి చెందిందని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి తెలిపారు. బుధవారం మండలంలోని బూడిదపా డు, అమరవాయి, సద్దలోనిపల్లి, మంగంపేట గ్రా మాలలో బండ్ల జ్యోతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఈ ఎన్నికలలో భారీ మోజార్టీతో గె లించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయ కులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, రంగన్న, చిన్నకిష్టన్న పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్‌ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కేటీదొడ్డి మండలంలోని నందిన్నెలోని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ధరూర్‌లో మహిళా ఆశీర్వాద సభకు హాజరైన మహిళలు



గద్వాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

వివాహిత అదృశ్యం



జాస్లీన్ (ఫైల్)

అలంపూర్ రూరల్: ఒక వివాహిత తప్పిపోయిన ఘటన మండలంలోని గొందిమల్లలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం.. మండలంలోని గొందిమల్లకు చెందిన చిన్న బ్రహ్మయ్య భార్య మాల జాస్లీన్ ఆదివారం 19 వ తేదీన వేకువ జామున నుంచి కనిపించకుండా పోయింది. వారికి నలుగురు సంతానం. శనివారం 18 వ తేదీన భర్త మద్యం తాగి రావడంతో ఇద్దరు గొడవ పడి వెళ్లిపోయింది. చుట్టు పక్కల, బంధువుల దగ్గర, రైల్వే స్టేషన్‌లో వెతికినా కనిపించలేదు. దీంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్.. పొంచి ఉన్న ప్రమాదం



ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెలేదు. దీంతో విద్యార్థులు ప్రమాదానికి అంచులో ఉన్నారు. విద్యార్థులు తిరిగే స్థలంలో కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయని, త్వరగా విద్యుత్ అధికారులు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీచుపల్లిని సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని బుధవారం వనపర్తి జిల్లా ఎన్నికల పరిశీలకుడు సోమేష్ మిశ్రా (ఐఏఎస్) సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు.

ఇంకా ఆరుబయటకే..

- పల్లెల్లో స్వచ్ఛత లేదు
- ప్రజలకు అవగాహన కరువు
- అధికారులు నిర్లక్ష్యం



చెన్నిపాడులో సామూహిక మరుగుదొడ్డి నిర్మాణానికి కేటాయించిన స్థలం

మానవపాడు: గ్రామాల్లో పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి. ఎక్కడ పడితే అక్కడ మలమూత్ర విసర్జన చేయడంతో పల్లెల్లో అపరిశుభ్రత నెలకొని రోగాలు వచ్చే ఆస్కారం ఉంటుంది. ఈ సమస్యను పూర్తిగా రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించినా అమలుకు నోచుకోవడం లేదు. ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నా చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. అధికారులు, సిబ్బందితో అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయించారు. ఆరుబయట మల, మూత్ర విసర్జన చేయటంతో వచ్చే దుష్పరిణామాలను తెలియజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రేషన్, పింఛన్, కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ప్రచారం చేయటంతో ఎంతో మంది నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకొచ్చారు.

మండలంలో..

మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 3005 మరుగుదొడ్లకు మొత్తం 3003 మరుగుదొడ్లను గ్రామ పంచాయతీల్లో నిర్మించారు. గ్రామాల వారీగా అమరవాయి 226, బోరవెల్లి 278, చంద్రశేఖర్‌నగర్ 103, చందూరు 116, చెన్నిపాడు 316, గోకులపాడు 94, జల్లాపురం 431, కలుకుంట్ల 54, కొర్విపాడు 262, మద్దూరు 274, మానవపాడు 455, నారాయణపురం 104, పల్లెపాడు 170, పెద్దఆముదాలపాడు 120, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో వీఎస్‌టీ పోగాకు కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించారు. ప్రతి గ్రామంలో మరుగుదొడ్లను నిర్మించినా వాటిని ఉపయోగించడంలో ప్రజలు విఫలమౌతున్నారు. ఇంకా ఆరుబయటకే మాలమూత్ర విసర్జనకు వెళ్తున్నారు.

గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం..

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు విఫలమౌతున్నారు. క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ స్త్రీలు, పురుషులు రోడ్లపై, పంటపొలాల్లో మలవిసర్జనకు వెళ్తున్నారు. గ్రామాల్లో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోంది. గ్రామాల్లో సర్పంచ్‌ల సహకారంతో కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. గతంలో మానవపాడులో గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన నాగేంద్రం గ్రామాల్లో ఉదయాన్నే వచ్చి కార్యదర్శులతో సమావేశమై ప్రజలకు అవగాహన కల్పించేవారు. ఇప్పుడు ఉన్న అధికారులు విధులకు హాజరఅవుతున్నామా.. వచ్చామా.. పోతున్నామా..? అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కార్యదర్శులు ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి గ్రామాల్లో నెలకొంది.

అధికారుల నిర్లక్ష్యం..

ప్రతి గ్రామంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి మరుగు దొడ్లను నిర్మించారు. ప్రతి గ్రామంలో ఎవరైతే మరుగుదొడ్లను వినియోగించుకోరో వారికి జరిమానా విధించాలి. మరుగుదొడ్లను వినియోగించకుండా బహిరంగ మాల, మూ త్రం చేసే కుటుంబానికి పింఛన్, కరెంట్, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలను నిలిపేయాలి. గ్రామస్థాయిలో కార్యదర్శులు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలి.

– శేఖర్, చెన్నిపాడు

అవగాహన కల్పిస్తాం..

ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. బ హిరంగ మాలవిసర్జనే మానుకోవాలని, లేదంటే ప్రజల నుంచి వచ్చే ప్రభుత్వ పథకాలు నిలిపేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– రమణరావు, ఎంపీడీఓ మానవపాడు

మిరప పంటను శాస్త్రవేత్తల పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్ర వేత్తలు

గట్టు: మిరప పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, పాలెంకు చెందిన వ్యవసాయ శాస్త్ర వేత్తలు మహేశ్వరమ్మ, శంకర్, నవతలు బుధవారం తప్పెట్లమొర్సు గ్రామ శివారులో సాగు చేసిన మిరప పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. పల్లయ్యగౌడు, భీమేష్ అనే రైతులకు చెందిన మిరప పంటలను పరిశీలించారు. మిరప సాగులో సూక్ష్మపోషకాల లోపం, ఆకు ముడత తెగుళ్లను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. సూక్ష్మపోషకాల నివారణకు సూక్ష్మపోషకాల మిశ్రమం 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకు ముడత నివారణకు స్పైనటారీం 0.9 మిల్లీలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి మిరప పంటపై పిచికారీ చేస్తే ఫలితముంటుందన్నారు. వారి వెంట వ్యవసాయ విస్తర్ణ అధికారి అనిత, రైతులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

అయిజ: మండల కేంద్రంలోని కాళమ్మపేటలో నూతనంగా నిర్మించిన కాళికాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. గంగపూజ, గో పూజ, గురు ప్రార్థన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, దేవనాంది అంకురార్పణ, పంచగవ్య ప్రాశన, ప్రోక్షణ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, గణపతి హోమం, దీక్షాహోమం, మహా మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కోతులగిద్దలో కార్తీకమాసం పూజలు



కోతులగిద్దలో భజనలు చేస్తున్న భక్తులు

ధరూరు: మండలంలోని కోతులగిద్ద శివారులోని శ్రీ అరణ్జేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున మహిళలు, చిన్నారులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై ఆలయం ముందు చిన్నారులు, భజన మండలి సభ్యులు ప్రత్యేక భజనలు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు.

మాయమాటలు నమ్మవద్దు : డీకే



మాట్లాడుతున్న డీకే అరుణ, పక్కన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బల్గెర శివారెడ్డి

గట్టు: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజలు అభ్యర్థి బల్గెర శివారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం తుమ్మలపల్లి, ముచ్చోనిపల్లె, మిట్టదొడ్డి, చాగదోన, చిన్నోనిపల్లె, లింగాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, రాష్ట్రంలో కూడా అధికారం అప్పగిస్తే, మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మాయ మాటలను ఓటర్లు నమ్మొవద్దని హితువు పలికారు. కేసీఆర్ మాయ మాటలతో కాలం గడుపుతున్నట్లు ఆరోపించారు. మరోమారు కేసీఆర్ మాటలను, కాంగ్రెస్ నాయకుల మాయమాటలను నమ్మొవద్దన్నారు. వాల్మీకి వర్గానికి చెందిన బల్గెర శివారెడ్డికి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ అవకాశం కల్పించిందని, వాల్మీకి సోదరులంతా కలిసి కట్టుగా బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదన్‌రావు, వైండింగ్ రాములు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి



మల్దకల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ముసాహిదాబేగం

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా సంక్షేమ అధికారి ముసాహిదాబేగం సూచించారు. బుధవారం మల్దకల్ హైస్కూల్‌లో బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని అమె పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, బాలల సంరక్షణ అధికారి నర్సింహ, సురేష్, ప్రకాష్, జయన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,180

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 2,090 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.8180, కనిష్టం రూ.2096, సరాసరి రూ.7500 ధరలు పలికాయి. 101 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ.5420, కనిష్టం రూ.2502, సరాసరి రూ.5390 ధరలు వచ్చాయి. దీంతోపాటు 1239 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2811, కనిష్టం రూ.1800, సరాసరి ధర రూ. 2700 ధరలు పలికాయి. వరి (హంస) 26 క్వింటాళ్లు గరిష్టం, కనిష్టం, సరాసరిగా రూ.1960 ధర వచ్చింది.

ఇంటి వద్దే ఓటింగ్



ఓటు వేయలేని వృద్ధులకు ఇంటివద్దనే వేయించిన అధికారులు

ఖిల్లాఘనపురం: పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని దివ్యాంగులు, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇళ్ల వద్దే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని పోలింగ్ అధికారి శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని మామిడిమాడ, సల్కెలాపురం, ఖిల్లాఘనపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు రాలేని 28 మందితో బుధవారం ఓటు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇలాంటి వారు మొత్తం 59 మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 46 మందితో ఓటు వేయించినట్లు తెలిపారు. గురువారం మిగిలిన 13 మందితో ఓటు వేయిస్తామని పీఓ పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ గణేష్, పలువురు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

తుల్జాభవాని అమ్మవారి ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం తండాలో బుధవారం తుల్జాభవాని అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తండాకు చెందిన గిరిజనులు తమ ఇష్టదైవమైన పోషమ్మ (తుల్జాభవాని) ఉత్సవాలను నిర్వహించారు. మంగళవారం నుంచి అమ్మవారి పూజలకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టిన గిరిజనులు రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.